క్లుప్తంగా

'ముందస్తు అడ్మిషన్లతో మోసం'



మాట్లాడుతున్న రాముయాదవ్, నాయకులు

హుజూరాబాద్: విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్న ఓ ప్రైవేట్ పాఠశాలపై వెంటనే ర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాముయాదవ్ కోరారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఓ ప్రైవేట్ పాఠశాల ముందస్తు అడ్మిషన్లతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తోందని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని, లేదంటే మండల విద్యాశాఖ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి రాంపల్లి రోహిత్, మండల నాయకులు కృష్ణ, సందీప్, వంశీ, రాజు, మణి తదితరులున్నారు.

పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



మల్లన్నపల్లిలో వైద్య సిబ్బంది

ఇల్లందకుంట: ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాచపల్లి, మల్లన్నపల్లి గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో మంగళవారం డాక్టర్ తులసీదాస్ ఆధ్వర్యంలో మహిళలకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. పలు వ్యాధులకు సంబంధించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్లు హిమజ, కల్యాణ్, టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఏఎన్ఎం స్వప్న, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

డిపాజిట్లపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మేనేజర్ సునీత

రామడుగు: సహకార కేంద్ర బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని గంగాధర సహకార కేంద్ర బ్యాంకు మేనేజర్ అమరావతి సునీత కోరారు. మండలంలోని వెదిర గ్రామంలో మంగళవారం రైతులకు బ్యాంకులో డిపాజిట్స్‌పై అవగాహన కల్పించారు. కేడీసీసీ బ్యాంకులో డబ్బులు డిపాజిట్ చేస్తే 7.60 శాతం వడ్డీ, అలాగే సీనియర్ సిటిజన్స్ డిపాజిట్ చేస్తే 8.10 శాతం వడ్డీ అందజేయడం జరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా బంగారు ఆభరణాలపై రుణాలు, బీమా సదుపాయం ఉందని వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఎం.రాంచంద్రం, ఎఫ్ఎల్‌సీ అనిల్, హరికృష్ణ, పలువురు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న రమణయ్య

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన మిట్టపెల్లి రాయమల్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మాచమల్ల రమణయ్య మృతుడి కుటుంబానికి రూ.50 వేల సీఎం సహాయనిధి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మడమడకల రాజిరెడ్డి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు మామిడి చంద్రమౌళి, మాచమల్ల కిషోర్, మామిడి రాజు, సుకోసి సమ్మయ్య, మాచమల్ల రవీందర్ తదితరులున్నారు.

విద్యార్థులకు అవగాహన

జమ్మికుంట: మండలంలోని తనుగుల ప్రభుత్వ ఉన్నత, ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు భూమి, నీరు, సహజవనరుల పరిరక్షణపై శాస్త్రవేత ఎల్. మల్లేశం మంగళవారం అవగాహన కల్పించారు. అంతేకాకుండా విద్యార్థులు తమ జ్ఞాపకశక్తిని ఎలా పెంచుకోవాలో వివరించారు. కార్యక్రమంలో టీచర్లు ఐలయ్య, స్వర్ణమయి, వెంకటేశ్వర్లు, శ్రీలత, మాధవి, వనమాల, అక్షర, పుష్పలీల, కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

కరీంనగర్ కార్పొరేషన్: పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో కుల సంఘాల జేఏసీ అధ్యక్షుడు జీఎస్.ఆనంద్, నూర్‌బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ బషీర్, సీహెచ్.లక్ష్మీరాజం, కుమార్, మల్లేశం, డాక్టర్ రహీం తదితరులకు కండువాలు కప్పి, ఆహ్వానించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.



గంగాధర: ముస్తాబైన సోమేశ్వరాలయం



మానకొండూర్: విద్యుత్ దీపాల వెలుగుల్లో ఈదులగట్టెపల్లి ఆలయం

మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు

గంగాధర: మహాశివరాత్రికి మండలంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. కొండన్నపల్లి గ్రామశివారులోని సహస్రలింగేశ్వర ఆలయానికి మహాశివరాత్రి సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. భక్తుల దర్శనం కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. వెంకంపల్లి గ్రామంలోని అతిపురాతన శివాలయానికి రంగులు వేసి అందంగా ముస్తాబు చేశారు. కోట్ల నర్సింహులపల్లి గ్రామంలోని సోమేశ్వరస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా సిద్ధం చేశారు.





వేడుకలకు ముస్తాబైన ఖాసీంపేట మానసాదేవి ఆలయం

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట శ్రీమానసాదేవి ఆలయం మహాశివరాత్రి వేడుకలకు సిద్ధమైంది. ఆలయం ఆవరణలోని ప్రత్యేక కొలనులో శివుడు, చుట్టూ 108 శివలింగాలు ప్రత్యేక ఆకర్షణగా ఉండటంతో భక్తులు ఏటా మహాశివరాత్రిన అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శనం చేసుకుంటారు. కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల సరిహద్దుల్లో ఉండటంతో మూడు జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఈసందర్భంగా ఆలయ గౌరవ అధ్యక్షుడు బద్దం చిన్న నర్సింహారెడ్డి, చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, ఆలయ అర్చకులు అమర్నాథ్‌శర్మ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇటీవల వాహనాల పార్కింగ్ కోసం భూమి లీజ్‌కు తీసుకున్నారు.

మానకొండూర్: మండలంలోని శివాలయాలను ఆలయ నిర్వాహకులు అందంగా ముస్తాబు చేశారు. ఈదులగట్టెపల్లి, లింగాపూర్, ఊటూరు, కొండపల్కల, గంగిపల్లి, చెంజర్ల వివిధ గ్రామాల్లోని శివాలయాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణానికి వేదికలు సిద్ధం చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు.

రోడ్డు ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కాలనీలవాసులు

జమ్మికుంట: రైల్వే ట్రాక్ కాంపౌండ్ వాల్ పక్కన మున్సిపల్ మాస్టర్ ప్లాన్ ప్రకారం 12 ఫీట్ల రోడ్డు ఏర్పాటు చేయాలని మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని 17, 20వ వార్డు ప్రజలు కమిషనర్ ఎండీ అయాజ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. రైల్వే గోడను ఆనుకొని ఉన్న ఇళ్ల యజమానులకు దారిలేక ఇబ్బంది పడుతున్నారని, మున్సిపల్ పరిధి రోడ్డును కబ్జా చేసి రోడ్డు లేకుండా చేస్తున్నారని వందలాది మంది సంతకాలతో కూడిన ఫిర్యాదు అందజేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని, రోడ్డు ఏర్పాటు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కల్లెపల్లి కీర్తన, నిహణ్య ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు ఎంపికయ్యారు. నాలుగేళ్లపాటు సంవత్సరానికి రూ.12,000 చొప్పున స్కాలర్‌షిప్ వస్తుందని, ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించి, నోట్‌బుక్స్, పెన్నులు బహుమతిగా అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానవంతులను శాసన మండలికి పంపాలి



మాట్లాడుతున్న వై అశోక్‌కుమార్

జమ్మికుంట: ఉపాధ్యాయుల సమస్యలు తెలిసిన విజ్ఞానవంతులను ఎన్నుకొని శాసన మండలికి పంపించాల్సిన ఆవశ్యకత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని, 36 ఏళ్లుగా ఉపాధ్యాయరంగంపై అవగాహన ఉంది మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వై. అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్పొరేటు, రియల్ ఎస్టేట్ రంగాల నుంచి అభ్యర్థులు రావడం బాధాకరమైన విషయమని, ఉపాధ్యాయులందరు ఆలోచించి ఓటు వేయాలన్నారు. టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేష్, టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి, కరీంనగర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మర్రి అవినాశ్, సీహెచ్ పోశయ్య, ప్రధానకార్యదర్శి బండి పర్శరాములు, సీనియర్ టీచర్లు గుంటి ఎల్లయ్య, పూల రాజమౌళి, దేవానందం, సారభద్రస్వామి, నేదురు కనుకయ్య, హరికిషన్ ఉన్నారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వండి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కరీంనగర్: పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే ఇవ్వాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కుతాటి రాణాప్రతాప్ కోరారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర బీసీ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. పెండింగ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.8,500 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. నిధులేక ప్రభుత్వ విద్యాసంస్థలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయని కనీసం మౌలిక సదుపాయాలు లేవని పేర్కొన్నారు. ఇంకోవైపు కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల పేరిట విచ్చలవిడిగా దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. 14 నెలల కాంగ్రెస్ పాలనలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడం విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోందన్నారు. పెండింగ్ బకాయిలు ఇవ్వకపోతే బడ్జెట్ సమావేశాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. నాయకులు ఎండీ.అస్లాం, కొయ్యడ బాబు, రాజేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతోనే ఉద్యోగులకు గుర్తింపు



సన్మానిస్తున్న శోభారాణి, తదితరులు

గంగాధర: నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తే మానసిక సంతృప్తితో పాటు గుర్తింపు వస్తుందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు అనుమాండ్ల శోభారాణి అన్నారు. మంగళవారం గంగాధర ఐసీడీఎస్ సీడీపీవో మేక కస్తూరి ఉద్యోగ విరమణ వీడ్కోలు సమావేశానికి హాజరై మాట్లాడారు. ఉద్యోగ విరమణ, బదిలీ తప్పవని పనిచేసే చోట మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. అనంతరం సీడీపీవో కస్తూరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంక్షేమ అధికారి సబిత, కరీంనగర్ బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి, సభ్యులు కళింగ శస్త్రఖర్, విజయ్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, సిబ్బంది, మహిళా సంక్షేమశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం



శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం బస్టాండ్ వెనుక భాగంలో మంగళవారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. గుర్తుతెలియని వ్యక్తి ఎండిన గడ్డికి నిప్పంటించాడు. మంటలు బస్టాండ్ ఆవరణలోని బైక్ పార్కింగ్ వైపు వ్యాపించడంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. దీంతో అప్రమత్తమైన పార్కింగ్ నిర్వాహకులు మంటలు అదుపులోకి తీసుకురావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

మంచినీటి నల్లా ధ్వంసం



శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మంచినీటి నల్లాను ఆకతాయిలు విరగొట్టారు. మంగళవారం తెల్లవారు జామున వాకర్స్ గమనించి ఇలాంటి చర్యలకు పాల్పడొద్దని గ్రామానికి చెందిన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.

గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షుడిగా రాజ్‌కుమార్




రాజ్‌కుమార్

హుజూరాబాద్: హుజూరాబాద్ ప్రాథమిక గొర్రెల కాపరుల సహకార సంఘం అధ్యక్షుడిగా బద్దుల రాజ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి ఈ.మంజుల తెలిపారు. మంగళవారం సహకార సంఘం డైరెక్టర్లుగా ఎంపికైన ఏడుగురిలో నుంచి రాజ్‌కుమార్ ఒక్కరే నామినేషన్ వేశారు. ప్రధాన కార్యదర్శిగా బాషాబోయిన రవి, డైరెక్టర్లుగా సారయ్య,రవి, లెంకలపల్లి రవీందర్, సింగరవేణి రవి, చేపూరి కొమరమ్మ, డి.స్వరూప నియామకమయ్యారు.

పరీక్ష సామగ్రి అందజేత

కరీంనగర్: పట్టణంలోని బీసీ వెల్ఫేర్ పాఠశాలలో ఆదరణ సేవా సమితి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై మంగళవారం అవగాహన కల్పించారు. పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు అందజేశారు. భూగర్భ జల శాఖ ఉపసంచాలకులు శ్యామ్‌ప్రసాద్ నాయక్, జిల్లా సఖి వన్ స్టాప్ సెంటర్ అధికారి లక్ష్మి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణ అలవర్చుకోవాలన్నారు. ప్రతీ ఒక్క రు ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని చెప్పారు. రైతులు పంట పొలాల్లో భూసారాన్ని పెంపొందించుకోవాలని, వరి కొయ్యలను కాల్చొద్దని సూచించారు. సమితి అధ్యక్షురాలు పావని, సభ్యులు సంధ్య, వీణ,హెచ్ఎం సుజాత, టీచర్లు పాల్గొన్నారు.

కొండచిలువతో గ్రామస్తుల ఆందోళన



చెరువులో భారీ కొండ చిలువ

రామడుగు: మండలంలోని వన్నారం గ్రామ పరిధి సుద్దాలపల్లి చెరువులో భారీ కొండచిలువ సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. చెరువు నీటిలో పలువురికి కనిపించడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. దీనివల్ల ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉందని, అధికారులు తక్షణం స్పందించాలని కోరుతున్నారు.



మానకొండూర్: మానకొండూర్ గ్రామ శివారులోని చెరువు మత్తడి పైనుంచి వెళ్లేందుకు వీలుగా నిర్మించిన కల్వర్టుపై దుబ్బమట్టి పేరుకుపోయింది. భారీ వాహనాలు వెళ్లే క్రమంలో దుమ్ము లేస్తోంది. ఫలితంగా వెనుకాలే వచ్చే ద్విచక్రవాహనదారులతో పాటు ఇతరులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరగకముందే దుబ్బమట్టిని తొలగించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజశేఖర్, ఆర్‌అండ్‌బీ ఏఈ సెల్ నంబర్: 9440818867

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

రామడుగు: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మంగళవారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్ మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి కష్టపడి చదువుతూ ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమేశ్, టీచర్లు శ్రీనివాస్, నాగరాజు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ జలజ పాల్గొన్నారు.

'ఓట్లు అడిగే దమ్ము సీఎం రేవంత్‌రెడ్డికి లేదు'



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

హుజూరాబాద్: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడిగే దమ్ము సీఎం రేవంత్‌రెడ్డికి లేదని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. పట్టణంలోని మధువని గార్డెన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి తప్పదని, పార్టీకి భవిష్యత్ లేదని, బీఆర్ఎస్‌ను నమ్మే స్థితిలో ప్రజలు లేరని పేర్కొన్నారు. ఎన్నికల్లో బీజేపీ అవకాశం ఇవ్వాలని, నియోజకవర్గంలోని పట్టభద్రులు, టీచర్స్‌పై నమ్మకంతో ఇక్కడికి వచ్చి ఓట్లు అడుగుతున్నా ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమరయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. సీఎం సభ పెడితే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇస్తారనుకుంటే నిరాశే ఎదురైందని, నిరుద్యోగులు, ఉపాధ్యాయులు వివిధ సమస్యలతో బాధపడుతున్నారని, వారి పక్షాన పోరాడేది బీజేపీ అని, పీఎం మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని కొత్తపల్లి పరిధిలోని పలు వార్డుల్లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు ఆధ్వర్యంలో నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రశ్నించే గొంతుక బీజేపీ అభ్యర్థికి మొదటి ప్రధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

చొప్పదండి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు నెలకు రూ. 4 వేలు ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ విమర్శించారు. గుమ్లాపూర్‌లో పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు, టీచర్ల సమస్యలను కాంగ్రెస్ గాలికి వదిలేసిందని, బీఆర్ఎస్ అభ్యర్థిని నియామకం చేయలేక పోయిందని, వారికి ఓట్లు అడిగే అర్హత లేదని విమర్శించారు.

శంకరపట్నం: ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొంరయ్యకు మద్దతుగా మండలంలో కార్యకర్తలు ప్రచారం చేశారు. బీజేపీ అభ్యర్థులను గెలిస్తేనే అభివృద్ధి జరుగుతుందని మండల అధ్యక్షుడు అనిల్, శ్రీనివాస్ తదితరులు కరపత్రాలు పంపిణీ చేశారు.

పట్టభద్రులు వివేకంతో ఓటేయాలి



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని పార్టీ జాతీయ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చిగురుమామిడిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాటాడారు. పట్టభద్రులు వివేకంతో ఆలోచించి ఓటువేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తుందని, ఏ అంశం మీదనైనా సీఎం ను నిలదీసే అవకాశం ఉంటుందన్నారు. బీజేపీ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థికి ఓటు వేస్తే సమస్యలపై ఎవరిని అడుగుతామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలన బాగుందని, ఆరుగ్యారంటీలను క్రమక్రమంగా అమలు చేయనున్నారని, ప్రట్టభద్రులు నరేందర్‌రెడ్డికే ఓటు వేయాలని కోరారు.

హుజూరాబాద్: పట్టభద్రులు నరేందర్‌రెడ్డికి ఓటేసి గెలిపించాలని సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల శంకర్ మంగళవారం కోరారు. నాలుగు దశాబ్దాలుగా విద్య, ఉపాధి రంగాలపై సంపూర్ణ అవగాహన కలిగిన వ్యక్తి నరేందర్ రెడ్డిని గెలిపిస్తే ప్రభుత్వానికి తగిన సలహాలు, సూచనలు చేస్తూ నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. దేశంలో పెట్టుబడుదారులు, కుబేరులను పెంచి పోషిస్తూ, పేద, మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారం మోపుతున్న బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికలపై అంతర్గత సమావేశం నిర్వహించారు. నరేందర్‌రెడ్డికి మద్దతుగా నాలుగు రోజుల క్రితం ఇదే ఫంక్షన్ హాల్‌లో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. పట్టభద్రుల నుంచి సానుకూల స్పందన లేకపోవడంతో స్వయంగా ముఖ్య నేతలు రంగంలోకి దిగి గ్రామాల వారీగా నేతలతో ఫోన్లు చేయించారని, పట్టభద్రులతో ముఖ్య నాయకుడు మాట్లాడినట్లు సమాచారం. ప్రచార సమయం ముగిసినా కొంత మందికి ఫోన్లు చేసినట్లు తెలిసింది. విషయం బయటకు పొక్కింది.

గన్నేరువరం: కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరుతూ మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు అనిల్, చంద్రారెడ్డి, మల్లేశం, అనిల్, నవీన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.